## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 15-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- అధునాతన పరిశోధనలు, నూతన సాంకేతికతలతో భారత్ వైద్య రంగంలో అపూర్వమైన పురోగతి సాధిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- కర్ణాటకలో శ్రీ గురుభైరవైక్య మందిరాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ప్రారంభించారు.
- అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్)తో పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు.
- బిహార్ నూతన ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.
- బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా.. లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

===================

అధునాతన పరిశోధనలు, నూతన సాంకేతికతలతో భారతదేశం వైద్య రంగంలో అపూర్వమైన పురోగతి సాధిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ఎయిమ్స్ 2వ స్నాతకోత్సవ వేడుకల్లో రాష్ట్రపతి ఈరోజు పాల్గొన్నారు. మొత్తం 210మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ఈ సందర్భంగా ప్రధానం చేశారు. అనంతరం రాష్ట్రపతి మాట్లాడుతూ, వైద్య రంగం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని మానవాళికి సేవ చేసే మార్గమని అన్నారు. పౌరులు ఆరోగ్యంగా ఉండి, దేశ నిర్మాణానికి తమ పూర్తి సామర్థ్యంతో దోహదపడేలా చూసేందుకు, గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందన్నారు. దేశవ్యాప్తంగా కొత్త ఎయిమ్స్ క్యాంపస్‌ల స్థాపన మెరుగైన వైద్య చికిత్స అందుబాటును పెంచడమే కాకుండా, వైద్య విద్యకు అవకాశాలను కూడా విస్తరించిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలలో ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడానికి, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ ప్రతి ఒక్కరికీ అందేలా చూడటానికి సాంకేతిక అభివృద్ధిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రపతి సూచిస్తూ...

(వాయిస్...34 సెకన్లు)

===================

కర్ణాటక మాండ్య జిల్లాలోని శ్రీ క్షేత్ర ఆదిచుంచనగిరిలో శ్రీ గురుభైరవైక్య మందిరాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, వికసిత్ భారత్ దార్శనికత వైపు వేగంగా పురోగమించేందుకు ప్రజలు ఈ 9 అంశాలను అలవర్చుకోవాలని సూచించారు. నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడడం, బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటించడం, అమ్మ పేరుతో మొక్కలు నాటడం, 'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను ప్రోత్సహించడం, పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేయడం, రసాయనాలు లేకుండా పంట సాగు చేయడం, ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకోవడం, నూనె పదార్థాలను పూర్తిగా తగ్గించడం, బరువుని అదుపులో ఉంచుకుంటూ దృఢంగా ఉండడం, ప్రకృతికి సేవ చేయడం ఈ తొమ్మిది అంశాలు అభివృద్ధి చెందిన భారతదేశం వైపు మన ప్రయాణాన్ని వేగవంతం చేయడంలో దోహదపడతాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

(వాయిస్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

బిహార్ నూతన ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నాలోని లోక్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అత హస్నైన్ ఆయనతో ప్రమాణం చేయించారు. బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్‌కుమార్ చౌధరీలు ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీకి చెందిన కీలక నాయకులు, ఎన్డీఏ కూటమి భాగస్వాములు పాల్గొన్నారు. సామ్రాట్ చౌదరికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవ పట్ల సామ్రాట్ చౌదరి అంకితభావం, క్షేత్రస్థాయి అనుభవం ఆ రాష్ట్రానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సమర్థవంతమైన నాయకత్వంతో సామ్రాట్ చౌదరి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ బీహార్ సర్వతోముఖాభివృద్ధిని కొత్త శిఖరాలకు చేర్చగలరని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

సమ్మిళిత, సమర్థవంతమైన 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృత్రిమ మేధ (ఏఐ) ఒక కీలక సాధనమని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన IIPA 72వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా "సుపరిపాలన కోసం ఏఐ" అనే అంశంపై ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' దార్శనికతను బలోపేతం చేసే ఏఐని వినియోగించుకోవడంలో భారతదేశం ముందంజలో ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేవలం సాంకేతిక విప్లవం మాత్రమే కాదని, ఇది ఒక మానవ విప్లవం అని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రభుత్వాలకు మునుపెన్నడూ లేని విధంగా మెరుగైన సేవలు అందించేందుకు సాధికారత కల్పిస్తోందన్నారు. పరిపాలన అంటే కేవలం నియమాలు, వ్యవస్థలకు సంబంధించినది కాదని, దాని నిజమైన ఉద్దేశ్యం ప్రజలకు సాధికారత కల్పించడమని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కార్యక్రమం కింద పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. న్యూఢిల్లీలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ మార్గదర్శకాలను ఆయన ఈరోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నగరాలు మరింత స్వయం సమృద్ధి సాధించడం, తమ సొంత ఆదాయాన్ని పెంచుకోవడం, అభివృద్ధి ప్రాజెక్టులలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం యూసీఎఫ్ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. గతంలో అనేక పట్టణ ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రాంట్లు, సాంకేతిక సహాయం ద్వారా చేపట్టేదని, అయితే వాటి అమలు మాత్రం ఎక్కువగా రాష్ట్రాలు, స్థానిక సంస్థలకే వదిలివేయబడిందని ఆయన పేర్కొన్నారు. పట్టణాభివృద్ధి పట్ల భారతదేశం అనుసరిస్తున్న విధానంలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ఒక నూతన ఒరవడిని సృష్టిస్తుందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్…33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో 93.70 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు సీబీఎస్ఈ బోర్డు వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం స్వల్పంగా పెరిగిందని తెలిపింది. ఈ ఫలితాల్లో బాలికలు 94.99 శాతం ఉత్తీర్ణతతో పైచేయి సాధించారు. మొత్తంగా 2.2 లక్షల మంది 90శాతం స్కోరు సాధించగా.. 55వేల మందికి పైగా 95శాతం స్కోరుతో రాణించారని బోర్డు వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

ఎయిర్ ఫోర్స్ మార్షల్ అర్జన్ సింగ్ 107వ జయంతి సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆయనకు నివాళులర్పించారు. అర్జన్ సింగ్ జీవితం భవిష్యత్ తరాలకు ఒక స్ఫూర్తి అని, దేశానికి నిజాయితీ, నిబద్ధతతో సేవ చేసేలా మార్గనిర్దేశం చేస్తుందని అన్నారు. అర్జన్ సింగ్ భారతదేశపు ఏకైక ఫైవ్-స్టార్ ఎయిర్ ఫోర్స్ అధికారి అని, ఆయన ధైర్యం, దూరదృష్టి దేశ వాయు శక్తిని తీర్చిదిద్దాయని రాజ్‌నాథ్ సింగ్ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశానికి అత్యంత విశ్వసనీయమైన, స్నేహపూర్వక భాగస్వామ్య దేశాలలో ఫ్రాన్స్ ఒకటని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఫ్రాన్స్ సెనేట్‌కు చెందిన భారత్ అంతర్-పార్లమెంటరీ బృందం ఈరోజు పార్లమెంట్ హౌస్‌లో ఓం బిర్లాను కలిసింది. ఈ సందర్భంగా ఇరు దేశాలు బలమైన, శాశ్వత సంబంధాలను కలిగి ఉన్నాయని ఓం బిర్లా అన్నారు. గత ఫిబ్రవరిలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ భారతదేశ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలను "ప్రత్యేక ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం" స్థాయికి పెంచడం, ఇరు దేశాల మధ్య పెరుగుతున్న పరస్పర విశ్వాసం, సహకారాన్ని ప్రతిబింబిస్తుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా.. లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఈరోజు ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన బెంగళూరు జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన లక్నో సూపర్ జెయింట్స్ జట్టు 12 ఓవర్లు పూర్తయ్యేసరికి 4 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =